

మేడ్చల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

# రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్లు

- ఆందోళనలో 8 లక్షల కుటుంబాలు
- ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలి
- వెంటనే ఆటో డ్రైవర్లతో చర్చలు జరుపాలి
- నిర్లక్ష్యం వహిస్తే అసెంబ్లీని ముట్టడిస్తాం
- నెలకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్
- బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్

మేడ్చల్, డిసెంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 8 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ పట్టణంలో బుధవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై ఆటో డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. లోటస్ గృహ సముదాయం నుంచి వివేకానంద విగ్రహం వరకు, తిరిగి ప్రభుత్వ ఐటీఐ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా ఆటో డ్రైవర్ల కుటుంబాలు 12 రోజులుగా పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నగరాలు, పట్టణాల్లోని ఆటో డ్రైవర్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారా.? ఆటో డ్రైవర్లు ఏడాదికి రూ.12వేలు ఇవ్వమని అడిగారా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణ నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలని, లేదంటే గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఆటోలను హైర్ చేసుకొని, నెలకు రూ.30వేల వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్లు తమ కుటుంబ సభ్యులేనని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. వెంటనే అన్ని సంఘాల ఆటో డ్రైవర్లతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళన కొనసాగిస్తామని, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో దాదాపు 500 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నేటి నుంచి సదరం దరఖాస్తుల స్వీకరణ

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ విధానంలో సదరం దరఖాస్తులను స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సాఫ్ట్ వేర్ అప్‌డేషన్‌లో భాగంగా సదరం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌లను కొంత కాలం నిలిపివేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా తిరిగి ఎప్పటిలాగే సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

## క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 20 : క్రిస్మస్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా నిర్వహించాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ జేరుషలేము మత్తయ్య ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ పండుగను అధికారికంగా నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌బీ స్టేడియంలో క్రిస్మస్ డిన్నర్ ఏర్పాటు చేయాలని, క్రైస్తవ భవనాలకు నిధులు విడుదల చేయాలని, క్రైస్తవుల సమాధుల కోసం గ్రేటర్‌లో ప్రభుత్వ స్థలాన్ని తమకు అప్పగించాలని, క్రైస్తవుల డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంద్ర జేవియర్, ఇజ్రాయల్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## విధులకు రాని టీచర్లకు నోటీసులు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : విధులకు హాజరుకాని ఎనిమిది మంది (ఎస్‌టీజీ) ఉర్దూ మీడియం టీచర్లకు చివరి అవకాశంగా నోటీసులు జారీ చేస్తూ బుధవారం జిల్లా విద్యాధికారిని ఆర్.రోహిణి నిర్ణయం తీసుకున్నారు. విధుల్లో చేరడానికి ఈ నెల 31 వరకు గడువు విధించామన్నారు. జిల్లాలో గత కొంతకాలంగా ఎలాంటి అధికారిక అనుమతి లేకుండా ఎనిమిది మంది ఉర్దూ ఎస్‌జీటీలు విధులకు హాజరుకావడం లేదు. దీంతో పలు సార్లు విద్యా శాఖ నోటీసులు జారీ చేసింది. గెజిట్‌లో కూడా ఇచ్చారు. అయినా స్పందించడం లేదు. దీంతో వారికి నోటీసులు పంపించారు.

కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన వీఎస్టీ స్టీల్ బ్రిడ్జి



# అప్పులు కాదు.. భవిష్యత్తుకు బాటలు

- తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన రుణాలతో అభివృద్ధి
- ఉమ్మడి రాష్ట్రంలో ఏండ్లకు ఏండ్ల తరబడి ప్రాజెక్టులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏకంగా 36 ప్రాజెక్టులు అందుబాటులోకి
- భవిష్యత్ తరాలకు చెక్కు చెదరని ఆస్తిగా నిలిచిన ప్రాజెక్టులు
- ట్రాఫిక్ రహిత నగరంగా మారిన హైదరాబాద్

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ ) : ఒకవైపు నిధుల సమీకరణ.. మరోవైపు అభివృద్ధికి బాటలు వేస్తూ కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే హైదరాబాద్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దింది. హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా మార్చే చర్యల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక్క ఫ్లై ఓవర్ కట్టాలంటే ఉమ్మడి రాష్ట్రంలో ఏండ్లకు ఏండ్లు సమయం పట్టేది. కానీ కేసీఆర్ ప్రభుత్వం హయాంలో కేవలం ఏనిమిదిన్నరేళ్లలో 36 ప్రాజెక్టులను అందు బాటులోకి తీసుకువచ్చి భవిష్యత్ తరాలకు చెక్కు చెదరని ఆస్తిగా మలిచింది. 2015 సంవత్సరంలో రూ.5112.36కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టగా.. 36 ప్రాజెక్టులు 20 ఫ్లై ఓవర్లు, ఐదు అండర్‌పాస్‌లు, ఏడు ఆర్వోబీ/ఆర్‌యూబీలు, కేబుల్ బ్రిడ్జి, మరో మూడు ఇతర ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చి ట్రాఫిక్ సుడిగుండాలకు శాశ్వతంగా చెక్ పెట్టారు.



కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన రాయదుర్గంలోని అండర్‌పాస్

| ప్రాజెక్టు పేరు | కారిడార్ | కిలోమీటర్లు | రోజూవారి వాహనాల సంఖ్య |
|---|---|---|---|
| జేఎన్‌టీయూ-గచ్చిబౌలి | రాజీవ్‌గాంధీ చౌక్, అయ్యప్ప సొసైటీ, మైండ్ స్పేస్, బయోడైవర్శిటీ | 12.10కి.మీ | 2.50 లక్షల వాహనాలు |
| పంజాగుట్ట-కేబీఆర్ పార్కు -మాదాపూర్ | రోడ్ నం.45, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, పంజాగుట్ట స్టీల్ బ్రిడ్జి | 14.10కి.మీ | 5 లక్షల వాహనాలు |
| ఉప్పల్ -ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు | నాగోల్ ఫ్లై ఓవర్, కామినేని, ఎల్బీ నగర్, బైరామల్‌గూడ, ఏపీజే అబ్దుల్ కలాం, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్లు | 31కి.మీ | 2లక్షల వాహనాలు |
| లక్డీకాపూల్ -గచ్చిబౌలి ఓఆర్ఆర్ | ఓయూ కాలనీ, బయోడైవర్సిటీ టీ జంక్షన్, శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్ | 15.20కి.మీ | 3.50 లక్షల వాహనాలు |
| గచ్చిబౌలి ఓఆర్ఆర్-మియాపూర్ | శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్, కొత్తగూడ జంక్షన్ | 13.30కి.మీ | 2 లక్షల వాహనాలు |

## ప్రయాణం సాఫీగా సాగాలంటే..

ప్రయాణం సాఫీగా సాగాలంటే.. వాహనం ఉంటే సరిపోదు. సరైన రోడ్డు మార్గం ఉండాలి. ఇదే స్ఫూర్తితో జీహెచ్ఎంసీ పరిధిలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి (ఎస్‌ఆర్‌డీపీ) పథకం చేపట్టి అనతికాలంలోనే సిగ్నల్ రహిత రవాణా వ్యవస్థగా మార్చారు. నగరవాసులకు మెరుగైన వసతులు, భవిష్యత్ పెట్టుబడిగా నిలిచే ప్రాజెక్టులకు దాదాపు రూ.6,200కోట్ల మేర జీహెచ్ఎంసీ రుణం తీసుకున్నది. ఎస్‌ఆర్‌డీపీకి బాండ్ల ద్వారా రూ.495 కోట్లు, ఎస్‌బీఐ నుంచి రూపీ టర్మ్ లోన్ ద్వారా రూ.2,500కోట్లు, సీఆర్ఎంపీకి రూ.1460 కోట్లు, నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) రూ.680కోట్లు, ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన జేఎన్ ఎన్‌యూఆర్ఎం ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పనుల కోసం రూ.140కోట్ల మేర హడ్కో వద్ద అప్పు చేశారు. హడ్కో మినహా మిగతా అప్పులకు ఇప్పటి వరకు దాదాపు రూ.40కోట్ల మేర వడ్డీ చెల్లిస్తున్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ముద్ర వేసేలా తొమ్మిదిన్నరేళ్లలో ప్రగతి పథంలో నగరాన్ని నిలిపారు. ఈ క్రమంలోనే ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రగతికే పట్టం కట్టి బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించడం ఇందుకు నిదర్శనం. గ్రేటర్‌లో ఒక్క స్థానంలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలవకపోవడం గమనార్హం.

## ఎస్ఆర్‌డీపీ ప్రయోజనాలు

ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, ప్రధాన కారిడార్‌లలో సమగ్ర పద్ధతిలో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ప్రయాణం సాఫీగా జరగడంతో వాహనదారులకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది. అత్యధికంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, బాచుపల్లి, పటాన్‌చెరువు, అబిడ్స్, చార్మినార్, ఎల్బీనగర్ , చాంద్రాయణగుట్ట, శంషాబాద్ ఎయిర్ పోర్టు, ఉప్పల్, సికింద్రాబాద్, ఈసీఐఎల్, అల్వాల్, కొంపల్లి, జీడిమెట్ల కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ లేకుండా పరిష్కారం లభించింది. ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన చోట ప్రయాణ సమయం తగ్గింది. మొబిలిటి పెరిగింది. వాహనదారులు సిగ్నల్ రహిత ప్రయాణం సాగిస్తున్నారు.



శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్